1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 186 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 31 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 186 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 31 May 2025 PAGES : 8 PRICE : 3/-

## పాకిస్థాన్ కోలుకోవడానికి కనీసం నాలుగైదేళ్లు పడుతుంది

బీఎస్ఎఫ్ దెబ్బకు పాక్ విలవిల్లాడిందన్న అమిత్ షా
పాక్ నిఘా వ్యవస్థ ఛిన్నాభిన్నమయిందని వ్యాఖ్య
పాక్ దాడుల బాధితులకు త్వరలోనే ప్యాకేజీ ఇస్తామని హామీ
ఆపరేషన్ సిందూర్ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 30)
తొలిసారిగా జమ్మూకశ్మీర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత బలగాల ధైర్యసాహసాలను కొనియాడారు."ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని -మిగతా 2లో

## ఆపరేషన్ సిందూర్‌తో రాజకీయ లబ్ధికి యత్నం

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 30)
పశ్చిమబెంగాల్‌లో దయలేని ప్రభుత్వం కొనసాగుతోందంటూ ప్రధాని మోదీ విమర్శించడంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. 'పహల్గాం ఘటనపై యావత్ దేశం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాం. మేమంతా ఒక్కటే, ఉగ్రవాదాన్ని సహించేది లేదు అనే సందేశాన్ని తెలియజేయడానికి అఖిలపక్ష ప్రతినిధులు విదేశాల్లో పర్యటిస్తున్న సందర్భంలో ప్రధాని మోదీ ఈ విధంగా మాట్లాడడం బాధాకరం' అని మమత విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయ లబ్ధికి వినియోగించుకోవడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అలిపుర్‌ద్వార్‌లో గురువారం భాజపా నిర్వహించిన సభలో -మిగతా 2లో



## ఏపీలో పెట్టుబడులకు రెడ్ కార్పెట్
### సీఐఐ సదస్సులో చంద్రబాబు

- సంపద సృష్టితోనే సంక్షేమ పథకాలు సాధ్యం: సీఎం చంద్రబాబు
- పారిశ్రామికవేత్తలు సహకరిస్తేనే ఏపీ అభివృద్ధి అని వెల్లడి
- దిల్లీ సీఐఐ సదస్సులో ప్రభుత్వ విధానాలు వివరించిన సీఎం
- పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలతో దేశ గతి మార్పు
- ప్రధాని మోదీ నాయకత్వం దేశానికి ప్రధాన బలం అన్న చంద్రబాబు




(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 30)
ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్ది, పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చేందుకు తమ ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు, విస్తరణకు అనుకూల వాతావరణం కల్పించి, పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ పరుస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. దిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) వార్షిక సదస్సులో పాల్గొన్న ఆయన, రాష్ట్ర ప్రభుత్వ నూతన పారిశ్రామిక విధానాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రముఖ పారిశ్రామికవేత్తల ముందు ఆవిష్కరించారు.

**ఏపీ పెట్టుబడులకు స్వర్గధామం - సీఎం భరోసా**
ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయం. పారిశ్రామికవేత్తలకు అవసరమైన అన్ని అనుమతులను సత్వరమే అందించి, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ద్వారా వ్యాపార నిర్వహణను సులభతరం చేస్తాం అని చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే నినాదంతో ముందుకు వెళ్లామని, ఇప్పుడు దానిని మరో మెట్టు ఎక్కించి, వేగవంతమైన అనుమతులు, ప్రోత్సాహకాలతో పారిశ్రామిక ప్రగతికి -మిగతా 2లో

## అసలు సమస్యలను వదిలేసి ఎమర్జెన్సీపై ప్రత్యేక సమావేశాలా?



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 30)
దేశంలో అత్యయిక పరిస్థితి(ఎమర్జెన్సీ) ప్రకటించి 50 ఏళ్లవుతున్న సందర్భంగా జూన్‌లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తుండటంపై కాంగ్రెస్ మండిపడింది. ప్రస్తుత సమస్యలపై దృష్టి మళ్లించడానికే ఈ తరహా రాజకీయాలకు మోదీ పాల్పడుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు."పహల్గాం ఉగ్రదాడిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఏప్రిల్ 22నే కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అది ఇంకా జరగలేదు. మే 10న ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని లోక్‌సభ, రాజ్యసభలోని విపక్ష నేతలు ప్రధానికి లేఖ రాశారు. వారి సలహానూ ప్రధాని అంగీకరించలేదు. ఆత్యయిక పరిస్థితికి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను జూన్ 25, 26 తేదీల్లో నిర్వహించాలని యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇది దేశం ఎదుర్కొంటున్న వాస్తవ, అత్యవసర సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రధానమంత్రి చేస్తున్న ఇంకో -మిగతా 2లో

# ముష్కరులను ఎగదోస్తే ఉగ్ర నరసింహావతారమే



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 30)
ఉగ్రవాదుల్ని పెంచిపోషించి పొరుగుదేశాలపైకి ఉసిగొలిపితే భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రధాని మోదీ మరోసారి గట్టిగా హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్‌ద్వార్‌లో గురువారం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. శత్రువును మోకాళ్లపై కూర్చోబెట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నానని ప్రధాని మోదీ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైందని, 'సిందూర్ ఖేలా' శక్తి ఏమిటో ఈ రాష్ట్ర మహిళలకు బాగా తెలుసని పేర్కొన్నారు.

దుర్గామాత పూజలో భాగంగా పశ్చిమబెంగాల్ మహిళలు సంప్రదాయబద్ధంగా 'సిందూర్ ఖేలా' నిర్వహిస్తారు. 'పహల్గాంలో మన సోదరీమణుల నుదుటి సిందూరాన్ని చెరిపివేసే దుస్సాహసానికి ముష్కరులు పాల్పడ్డారు. వారికి సిందూరం శక్తి ఏంటో మన సైన్యం రుచి చూపించింది. మనం వారి భూభాగంలోకి ప్రవేశించి మూడుసార్లు దాడులు చేశామని పాకిస్థాన్ గుర్తుంచుకోవాల'ంటూ... మెరుపు దాడులు (2016), బాలాకోట్ వైమానిక దాడులు(2019), ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. ఉగ్రవాదం, ప్రజల ప్రాణాలు తీయడంలో పాకిస్థాన్ ఆర్మీ బాగా ఆరితేరిందన్నారు.

**బెంగాల్‌లో 'నిర్మమ్' సర్కార్' :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కొనసాగిన నిరసనల సమయంలో ముర్షిదాబాద్, మాల్దాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమ్' -మిగతా 2లో

## భారత్‌ను ఆపాలని పాక్ ప్రపంచ దేశాలను వేడుకుంది

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 30)
భారత నౌకాదళానికి చెందిన విమాన వాహకనౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ను శుక్రవారం కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అక్కడి అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మన దేశం శక్తిమంతమైన దాడులు చేయడంతో భారత్‌ను ఆపాలని పాకిస్థాన్ ప్రపంచదేశాలను వేడుకుంది. మన నిబంధనల ప్రకారమే సైనిక



చర్యలను ఆపేశాం. ఆపరేషన్ సమయంలో నేవీ పాత్ర అద్భుతమైనది. పాక్ గడ్డపై ఉన్న ఉగ్రవాద స్థావరాలను వైమానిక దళం నేలమట్టం చేసింది. అదే సమయంలో మన నావికాదళం సముద్రంలో చూపిన సంసిద్ధత పాక్ నావికాదళాన్ని ఎక్కడికీ కదలనీయకుండా చేసింది. మీ ముందస్తు మోహరింపుతో పాక్ ధైర్యంపై దెబ్బకొట్టారు. మీరు పాక్‌పై చర్యలు -మిగతా 2లో

## రానున్న మూడ్రోజుల పాటు ఏపీకి వర్ష సూచన

రాష్ట్రానికి చల్లని కబురు: పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు
రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడే అవకాశం
కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 30)
రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు వాతావరణంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు, పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలకు ఇది కొంత ఉపశమనం కలిగించే వార్త కాగా, ఏయే -మిగతా 2లో



## పాక్‌లో ఉగ్రవాదులు హతమైతే సంతాపమా..? శశిథరూర్



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 30)
ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడంపై కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ అసహనం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అందులో శశిథరూర్ నాయకత్వంలోని బృందం ప్రస్తుతం కొలంబియా కు వెళ్లింది. ఈక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

'ఉగ్రవాద దాడుల బాధితులపై సానుభూతి వ్యక్తపరచకుండా.. భారత్ దాడుల తర్వాత పాక్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడం మమ్మల్ని నిరాశ పరిచింది. మా ఆత్మరక్షణ హక్కును మాత్రమే మేము వినియోగించుకున్నాం. ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులను గురించి కొలంబియా అధికారులతో వివరంగా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ దేశం కూడా అనేక ఉగ్రదాడులను చూసింది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత్ అనేక దాడులను భరించింది. పాకిస్థాన్ తన సైనిక పరికరాలను వారి రక్షణ కోసం కాకుండా.. పక్క దేశాలపై దాడి కోసం వినియోగిస్తోంది. ఉగ్రదాడికి వ్యతిరేకంగా మాత్రమే మా విధానాలు ఉంటాయి' అని థరూర్ పేర్కొన్నారు. పహల్గాం దాడి వెనక పాక్ ప్రాయోజిత ఉగ్రవాదం ఉందనడానికి భారత్ వద్ద కచ్చితమైన ఆధారాలున్నాయని థరూర్ వెల్లడించారు. ఈసందర్భంగా పాక్‌లోని మొత్తం రక్షణ పరికరాల్లో 81శాతం చైనా -మిగతా 2లో

## సీఏ కావాలనుకుని మంత్రి అయ్యాను

సీఏ విద్యార్థుల జాతీయ సదస్సులో మంత్రి నాదెండ్ల ప్రసంగం
రాజకీయ నాయకులకు సీఏలు, లాయర్ల అవసరం తప్పనిసరి అని వ్యాఖ్య
త్వరలో ఏపీకి అంతర్జాతీయ కంపెనీలు రాబోతున్నాయన్న మంత్రి

(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 30)



తాను కూడా చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) కావాలని ఆశించి, ఆర్టికల్స్ కూడా పూర్తి చేశానని, కానీ చివరికి రాజకీయ నాయకుడినయ్యానని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడలో జరిగిన ఐసీఏఐ జాతీయ విద్యార్థుల సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొన్ని లెక్కలకు సంబంధించి ఆరేళ్ల తర్వాత ఆడిటింగ్ నిర్వహించడం ఆశ్చర్యం కలిగిస్తోందని, ప్రభుత్వ లెక్కల విషయంలో ఇంత జాప్యం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. భారతదేశంలో ఏ రాజకీయ నాయకుడికైనా చార్టర్డ్ అకౌంటెంట్ లేదా న్యాయవాది సహాయం కచ్చితంగా అవసరమని ఆయన పేర్కొన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ఆధారితం నుంచి సాంకేతికత ఆధారితంగా రూపాంతరం చెందుతోందని మంత్రి తెలిపారు. కొనుగోలు శక్తిలో మన దేశం జపాన్‌ను అధిగమించిందని చెప్పారు. రాష్ట్రానికి త్వరలో అనేక అంతర్జాతీయ సంస్థలు, గ్లోబల్ చైన్లు రానున్నాయని, వాటికి సీఏల సేవలు ఎంతగానో అవసరమని అన్నారు. "ఈ ఏడాది చివరి నాటికి భారతదేశం నాలుగు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది" అని ఆయన అంచనా వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మనోహర్ వెల్లడించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడిస్తున్నామని, వాట్సాప్ ద్వారా పంట కొనుగోళ్లకు అవకాశం కల్పిస్తే 74 వేల మంది రైతులు నమోదు చేసుకోగా, 18 వేల మంది తమ పంటను విజయవంతంగా అమ్ముకున్నారని తెలిపారు. అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీ రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి తెస్తామని, రైతులు విక్రయించిన ధాన్యం బస్తాలకు క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రజలను కూడా పీ4 (ప్రజా భాగస్వామ్యం)లో భాగస్వాములను చేయడానికి కారణం, వారు కూడా దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారని చెప్పడానికేనని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

## ముష్కరులను ఎగదోస్తే ఉగ్ర నరసింహావతారమే

(దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. 'రాష్ట్రంలో అధికార పార్టీ వ్యక్తులు కొందరి ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే పోలీసులు అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా? ఇక్కడి సర్కారుపై ప్రజలకు విశ్వాసం లేదు. దీనిని మార్చివేయాలని, సుపరిపాలన కావాలని కోరుకుంటున్నారు' అని మోదీ పేర్కొన్నారు.

**ఇదే సరైన సమాధానం**

భారత్‌లో ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసే వారికి సరైన సమాధానం ఆపరేషన్ సిందూర్ అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు దేశం మొత్తం ఏకమైందన్నారు. సిక్కిం రాష్ట్ర హోదా పొంది 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా గ్యాంగ్‌టక్‌లోని పల్జోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి వర్చువల్ విధానంలో ఆయన ప్రసంగించారు. ప్రతికూల వాతావరణం వల్ల గ్యాంగ్‌టక్‌కు రాలేకపోయినట్లు తెలిపారు.

## ఏపీలో పెట్టుబడులకు రెడ్ కార్పెట్
### సీఐఐ సదస్సులో చంద్రబాబు

ఊతమిస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో సంపద సృష్టి జరిగితేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, ఈ సంపద సృష్టిలో పారిశ్రామికవేత్తలే చోదకశక్తి అని ఆయన అభివర్ణించారు.

**కీలక ప్రాజెక్టులు – ఉజ్వల భవిష్యత్తుకు సంకేతాలు**

రాష్ట్రంలో రాబోయే కీలక ప్రాజెక్టుల గురించి చంద్రబాబు వివరిస్తూ, అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి 'క్వాంటం వ్యాలీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇది సాంకేతిక రంగంలో రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో టీసీఎస్ కార్యకలాపాలు, ఆర్సెల్లార్ మిట్టల్ పరిశ్రమ ఉత్పత్తి త్వరలోనే ప్రారంభం కానున్నాయని, గూగుల్ వంటి ప్రఖ్యాత సంస్థ కూడా విశాఖకు రానుందని వెల్లడించారు. ఇవి యువతకు వేలాది ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని అన్నారు.

**గ్రీన్ ఎనర్జీ – ఏపీ అగ్రగామి**

హరిత ఇంధన (గ్రీన్ ఎనర్జీ) రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు అపార అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ వంటి అన్ని విభాగాల్లోనూ ఏపీ ముందు వరుసలో ఉంది. ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు ఏడాది కాలంలోనే మాకు అందాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా దాదాపు నాలుగున్నర లక్షల ఉద్యోగాలు లభిస్తాయి" అని ఆయన వివరించారు. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తిలో రాష్ట్రాన్ని గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు.

**పారిశ్రామిక పార్కులు – సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక పార్కు చొప్పున మొత్తం 175 పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలనేది తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. మైనింగ్, టూరిజం రంగాల్లో కూడా పెట్టుబడులకు పుష్కలమైన అవకాశాలున్నాయని, రతన్ టాటా సహకారంతో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు కానుందని తెలిపారు. "ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నదే నా ఆకాంక్ష. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పారిశ్రామికవేత్తల సహకారం అత్యంత అవసరం" అని ఆయన పిలుపునిచ్చారు.

**మోదీ నాయకత్వం – దేశానికి దిక్సూచి**

ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని చంద్రబాబు ప్రశంసించారు. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని, ఆయన నాయకత్వ పటిమ దేశానికి ఒక ప్రధాన బలమని కొనియాడారు. దివంగత ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశ గతిని మార్చాయని, తాను కూడా 1990లలో ఇంటర్నెట్ విప్లవాన్ని అందిపుచ్చుకున్న తొలితరం నాయకులలో ఒకడినని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చేసిన ఈ కీలక ప్రకటనలు, రాష్ట్ర పారిశ్రామిక భవిష్యత్తుపై నూతన ఆశలు రేకెత్తిస్తున్నాయి. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు, ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్ త్వరలోనే దేశ పారిశ్రామిక పటంలో అగ్రస్థానానికి చేరుకుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పాకిస్థాన్ కోలుకోవడానికి కనీసం నాలుగైదేళ్లు పడుతుంది

మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిగా, పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దుల్లోని పౌరులపై దాడులకు తెగబడింది. అయితే, మన బీఎస్ఎఫ్ దళాలు ఈ దాడులను అత్యంత సమర్థవంతంగా తిప్పికొట్టాయి" అని తెలిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన సుమారు 118 పోస్టులను మన బలగాలు నాశనం చేశాయని ఆయన వెల్లడించారు. "శత్రువుల సమాచార, నిఘా వ్యవస్థలను మనవాళ్లు ఒక్కొక్కటిగా కూల్చివేశారు. ఈ నష్టం నుంచి కోలుకోవడానికి పాకిస్థాన్‌కు కనీసం నాలుగైదేళ్లు పడుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అందించిన సమాచారం ప్రకారం, పాకిస్థాన్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లిందని అమిత్ షా తెలిపారు. కొంతకాలం పాటు పూర్తిస్థాయి సమాచార ఆధారిత యుద్ధం చేసే స్థితిలో పాకిస్థాన్ లేదని ఆయన అన్నారు. బీఎస్ఎఫ్ దళాల అప్రమత్తత, స్పష్టమైన వ్యూహరచన, వాటిని విజయవంతంగా అమలు చేసిన తీరును హోంమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు.

భారత సరిహద్దుల్లో ఎలాంటి దాడి జరిగినా, ఆ భారాన్ని మొట్టమొదట మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని ఆయన గుర్తుచేశారు. జమ్మూకశ్మీర్‌లో తన రెండు రోజుల పర్యటనలో భాగంగా, ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల్లో నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల వల్ల దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం త్వరలోనే పరిహార ప్యాకేజీని ప్రకటిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. పాక్ దాడులతో నష్టపోయిన పలు ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన అమిత్ షా, అక్కడి స్థానిక ప్రజలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్‌తో రాజకీయ లబ్ధికి యత్నం

పాల్గొన్న ప్రధాని మోదీ... తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో హింస జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 'ఆపరేషన్ బెంగాల్'ను చేపట్టి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలిపివేస్తామన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి సుకాంతా మజుందార్ వ్యాఖ్యలనూ మమత ఖండించారు. రాష్ట్ర ప్రజలు ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారన్న ప్రధాని మాటలనూ తిప్పికొట్టారు. 'మేము సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రంలో వెంటనే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా?' అంటూ సవాల్ విసిరారు.

## అసలు సమస్యలను వదిలేసి ఎమర్జెన్సీపై ప్రత్యేక సమావేశాలా?

ప్రయత్నం మాత్రమే. దేశంలో 11 ఏళ్లుగా అప్రకటిత అత్యయిక పరిస్థితిని విధించిన మోదీ.. ఎందుకు పహల్గాం ఉగ్రవాదులు పరారీలో ఉన్నారో చెప్పరు. కాల్పుల విరమణ మధ్యవర్తిత్వానికి డొనాల్డ్ ట్రంప్‌ను ఎందుకు అనుమతించారో చెప్పరు. భారత భూభాగాన్ని ఆక్రమించిన చైనాకు 2020 ఏప్రిల్ 19న ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారో చెప్పరు" అంటూ జైరామ్ విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా మహిళలకు సిందూర్ పంచాలన్న భాజపా ప్రణాళికలపైనా కాంగ్రెస్ మండిపడింది. మోదీ ప్రభుత్వ 'రాజకీయ, దౌత్య' వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయ లబ్ధి కోసం భాజపా వాడుకుంటోందని ఆరోపించింది.

## భారత్‌ను ఆపాలని పాక్ ప్రపంచ దేశాలను వేడుకుంది

తీసుకోవాల్సిన అవసరం లేదు. మీ సన్నద్ధతే దాయాదికి గట్టి హెచ్చరిక. భారత నావికాదళ శక్తిని, సైనిక చర్యలను, సామర్థ్యాలను చూసి శత్రుదేశం భయాందోళనకు గురైంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని.. ఇచ్చింది విరామమేనని పేర్కొన్నారు. పాక్ మరో తప్పు చేస్తే ఈసారి కోలుకునే అవకాశమే లేకుండా గట్టిగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించి పాక్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే పాక్ ప్రతిస్పందనను నావికాదళం పసిగట్టి.. తమ సంసిద్ధతను గణనీయంగా పెంచడానికి పలు చర్యలు తీసుకుంది. పాక్‌లోని కరాచీ పోర్టు లక్ష్యంగా ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించింది.

## రానున్న మూడ్రోజుల పాటు ఏపీకి వర్ష సూచన

ప్రాంతాల్లో వర్షాలు పడతాయోనన్న ఆసక్తి నెలకొంది. వివరాల్లోకి వెళితే, ముఖ్యంగా శనివారం నాడు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో కూడా ఇలాంటి వర్షపాతమే నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా, శనివారం రోజున కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు పడే సూచన ఉంది. రాయలసీమలోని వైఎస్ఆర్ కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూడా అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ వర్గాలు వెల్లడించాయి. మొత్తం మీద, రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అడపాదడపా వర్షపు జల్లులు కురిసే పరిస్థితులు కొనసాగుతాయని తెలుస్తోంది. ఈ మార్పుతో వాతావరణం కొంత చల్లబడే అవకాశం ఉంది.

## పాక్‌లో ఉగ్రవాదులు హతమైతే సంతాపమా..? శశిథరూర్

నుంచి అందుతున్నవేనని తెలిపారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో భారత్ ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించి.. పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. ఈ దాడుల్లో 170 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. దీనికి పాక్ సైన్యం స్పందించి.. మనపై ప్రతిదాడులకు దిగింది. వాటిని మన బలగాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతుంది.

## కుక్కలు బాబోయ్ కుక్కలు



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 30)
గ్రామంలో కుక్కలు ఉన్నాయి. మీ పిక్కలు జాగ్రత్త అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొండపిలో సుమారు 100 వరకు వీధి కుక్కలు ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. కొండపి మండలంలోని అన్ని పంచాయతీలలో అత్యధికంగా కనపడుతున్నాయి. బండ్ల మీద వెళ్లే వాహనదారుల వెంట పడి మరి కుక్కలు పిక్కలు పీకుతున్నాయి. ఇటీవల కాలంలో ఒక చిన్నారిపై దాడి చేసిన గాని అధికారులకు కనువిప్పు కాలేదు. ఇంటి బయట పార్కు చేసిన వాహనాల సీట్లను కూడా కుక్కలు చించి వేస్తున్నాయి. ఎటు చూసినా కుక్కలే. అధికారులు చెప్పినట్టు కుక్కలు లేని ప్రదేశాలు కనబడటం లేదు. ఇంటి నుంచి బయటికి రావడానికి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కనికరించండి మహా ప్రభో అంటూ పంచాయతీ అధికారులకు కొండపి ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమానాలు పాటించాలి
### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 30)
డ్రైనేజ్ కాలువల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారా ఎక్కువ కాలం నిలబడి ప్రజలకు ప్రయోజనకరం చేకూరుస్తాయని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం కనిగిరి పట్టణంలోని ఎనిమిదో వార్డులో డ్రైనేజ్ కాలువల నిర్మాణపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో కనిగిరి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అప్పగించిన అభివృద్ధి పనులైన డ్రైనేజ్ కాలువలు పనులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. డ్రైనేజ్ కాలువల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే వర్షాలు వచ్చి డ్రైనేజ్ కాలువల్లో నీరు నిండిపోయి రోడ్లపై మురుగు నీరు పారడం వల్ల సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. డ్రైనేజ్ కాలువలు నాసిరకంగా ఉంటే ప్రజలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకోబడతాయని కాంట్రాక్టర్ సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని ఆయన కాంట్రాక్టర్‌కు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ షరీఫ్ ఉద్దీన్ కాంట్రాక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరి క్లబ్ కమిటీ సభ్యులతో ఎంపీ మాగుంట సమావేశం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)
ఒంగోలులోని హైదరి క్లబ్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి హైద్రి క్లబ్ అభివృద్ధిపై సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ నామినేని కిరణ్, మండవ మురళి కృష్ణ, తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు కొటారి నాగేశ్వరావులు పాల్గొన్నారు.



## పొదిలి పెద్దచెరువు వద్ద చెత్త తొలగింపు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 30)
పొదిలి నగర పంచాయతీ కమిషనర్ చొరవతో పెద్ద చెరువు వద్ద రహదారి పక్కనే ఉన్న చెత్త, చెదారాలు తొలగించారు. ఆదివారం ప్రార్థన సమయంలో దుర్వాసనతో భక్తులు ఇబంది పడుతున్న విషయం కమిషనర్ నారాయణరెడ్డి దృష్టికి స్థానిక బాప్టిస్ట్ చర్చి కమిటీ సభ్యులు తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించిన కమిషనర్ నారాయణరెడ్డి ఆ ప్రాంతంలో జేసీబీ సాయంతో పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా అక్కడ చెత్త వేస్తున్న వారి వివరాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశించారు. తమ విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకున్న కమిషనర్ నారాయణరెడ్డికి, శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతీరావుకు చర్చి ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ జి వసంత కుమార్, సెక్రటరీ పి రవీంద్రబాబు, ట్రెజరర్ జి శ్యామ్ కిరణ్, స్టాండింగ్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.









## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు కందుల, దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)

శుక్రవారం ఉదయం తిరుమలలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావులు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో వారికి (తరువాయి 4లో...)

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు   తెలుగు దినపత్రిక
ప్రకాశం

# లో గ్రేడ్ కొనుగోలు చేస్తేనే రైతులకు గిట్టుబాటు

పొగాకు రైతులను ఆదుకునేందుకు ఎస్‌టిసికి
రూ.300 కోట్లు కేటాయించి రంగంలోకి దించాలి
గిట్టుబాటు ధర కోసం రైతులు ఐక్యంగా ఉద్యమించాలి
పొగాకు రైతులు ఉద్యమానికి అండగా నిలుస్తాం
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, మే 30)

పొగాకు రైతును ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్ టిసికి రూ.300 కోట్లు కేటాయించి రంగంలోకి దించి కొనుగోలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ ప్రతినిధి బృందం తో కలసి ఒంగోలు -2 ( త్రోవగుంట) వేలం కేంద్రాన్ని వారు సందర్శించారు. వేలం నిర్వహణ తీరు, మార్కెట్‌లో లభ్యమవుతున్న ధరలు, తదితర అంశాలపై అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. పొగాకు బోర్డు,ఐటిసి వ్యవహారిస్తున్న తీరుపై ఆయన మండిపడ్డారు. ఐటీసి కంపెనీ రైతులకు సరైన ధర కల్పించ కుండా నియంత్రిస్తున్నట్లు ఆరోపించారు.



పొగాకు ధర పతనం అవుతున్నా ఐటిసి షేర్లు ధర పెరగడం ఆంతర్యం ఏమిటని కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించారు. రైతుల పక్షానరైతు ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు సందర్శించినప్పుడు అయిదో పదో పెంచడం, ఆ తరువాత ధరలు దిగజార్చడం పట్ల ఆయన అధికారులను కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించారు. గత ఏడాది మంచి ధర లభించడంవల్ల, బ్యాంకులు బారెన్ కు రూ 7.50 లక్షలు రుణాలు ఇవ్వడం, ఈ ఏడు కూడా లాభాలు వస్తాయని భావించిన రైతులు ఎక్కువ విస్తీర్ణం లో సాగుచేసారని, అయినప్పటికీ, వర్షాల కారణంగా సరైన దిగుబడి రాలేదని పలువురు రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. లో గ్రేడ్ అసలు కొనడం లేదని, గ్రేడ్ పొగాకు క్వింటాకు రూ 7500 తగ్గించి కొనుగోలు చేస్తున్నట్లు, ఇదే పరిస్థితి కొనసాగితే బారిన్ కు రూ.4 లక్షలు నుంచి రూ 5 లక్షలు నష్టం వచ్చే ప్రమాదం ఉందని రైతులు బ్రహ్మారెడ్డి,పోలినేని ఆదినారాయణ తదితరులు ఏకరువు పెట్టారు. ఈ నష్టాలు కంటే క్రాప్ హాలిడే ప్రకటించడం ఉత్తమమని రైతులు ఆవేదన చెందారు. లో గ్రేడ్ కొనుగోలు చేయకపోతే రైతులు

## పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు

పాఠశాలలు ప్రారంభించే నాటికి
సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు పూర్తి చేయాలి
ఒంగోలు, యర్రగొండపాలెంలో నూతన వసతి గృహాల నిర్మాణం పూర్తి చేయాలి
అధికారులకు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశం





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 30)

పాఠశాలలు ప్రారంభించేనాటికి జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు పూర్తి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రకాశం జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించేనాటికి జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా పెండింగ్ లేకుండా అన్ని వసతి గృహాల్లో పనులు పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దన్నారు. ఒంగోలు,యర్రగొండపాలెంలో నూతన వసతి గృహాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.143 కోట్లతో సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేస్తున్నామని మంత్రి తెలిపారు.



## ప్రభుత్వ సొమ్ము చెదల పాలు నిరుపయోగంగా చెత్త కటింగ్ మిషన్‌లు

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 30)

కొండపి పాత గ్రామ పంచాయతీ ఆఫీస్ నందు నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు చెత్తని పొడుం చేసే పంచాయతీ కార్మికులకు పని భారం తగ్గించేందుకు గ్రామ పంచాయతీలకు సమకూర్చింది. గత పాలకుల నిర్లక్ష్యం వలన సుమారు రూ.10 లక్షల రూపాయల విలువ చేసే చెత్త కటింగ్ మిషన్‌లు రెండు సంవత్సరాల నుంచి తుప్పు పట్టిపోయి, నిరుపయోగంగా ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి కటింగ్ మిషన్లు వాడుకులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

4



# బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పని చేయాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 30)

బాపట్లను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. శుక్రవారం, స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ లో బాల కార్మికుల నిర్మూలనపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ మాసమును చైల్డ్ డ్రైవ్ మాసంగా ఎన్‌సి పీసీఆర్ సూచనల మేరకు నిర్వహించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. 2009వ సంవత్సరంలో విద్యాహక్కు చట్టం ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ విద్యాభ్యాసం చేయాలని పార్లమెంటులో సవరణ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. 2016 సంవత్సరంలో చైల్డ్ లేబర్ రెగ్యులరైజేషన్ అండ్ ప్రొహిబిషన్ యాక్ట్ తీసుకు రావడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలు కార్మికులుగా పని చేయకూడదని ఆయన తెలిపారు. 2002 సంవత్సరం నుంచి జిల్లాలో డిటిఎఫ్ ఏర్పాటు చేసి ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తూ చైల్డ్ లేబర్‌ను తగ్గించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో గ్రానైట్ క్వారీలు, ఇసుక రీచ్‌లు, ఫ్యాక్టరీలు, హేచరీస్, జీడిపప్పు, చేపలు, రొయ్యలు ప్రాసెసింగ్ కేంద్రాల వద్ద, హొటల్లు, షాపులు, రిసార్టులలో తనిఖీ చేయాలని ఆయన అన్నారు. అక్కడ పనిచేసే 14 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి వారిని పనిలో పెట్టిన వ్యక్తుల యొక్క వివరాలు తెలుసుకొని వారిపై కేసులు నమోదు చేయాలని ఆయన అన్నారు. ఆ పిల్లలను రియాబిటేషన్ సెంటర్‌లకు తీసుకువచ్చి వారికి రక్షణ కల్పిస్తూ పాఠశాలలో చేర్చాలని ఆయన అధికారులకు, డిటిఎఫ్ సభ్యులకు సూచించారు. బాల కార్మికుల చట్టాలను ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీల ద్వారా కరపత్రాల ద్వారా ప్రచారం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజలు ఎక్కడైనా బాల కార్మికులను గుర్తించిన యెడల 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని ఆయన తెలిపారు. వివరాలు తెలిపిన వారి సమాచారమును గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు. జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యుల ఫోన్ నెంబర్లను జిల్లా అధికారుల గ్రూపులో ఉంచాలని లేబర్ అసిస్టెంట్ కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా అధికారులు ఎక్కడైనా బాల కార్మికులను గుర్తించిన యెడల డి.టి.ఎఫ్ సభ్యులకు తెలియజేసి బాల కార్మికులను సంరక్షించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో బాల కార్మికుల నిర్మూలనకు కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట శివప్రసాద్, పిల్లల సంరక్షణాధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్, ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి



### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)

యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్, ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జిల్లా కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం సాయంత్రం విజయవాడ ఏపీ సచివాలయంలోని సి.ఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జిల్లా కలెక్టర్లతో వర్చువల్‌గా సమావేశమై యోగాంధ్ర -2025 క్యాంపెయిన్, పీఎం సూర్య ఘర్ అమలు, వివిధ ప్రభుత్వ పథ కాల సేవల పట్ల ప్రజా స్పందనలు వంటి అంశాల పై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 2. 20 కోట్ల మంది ప్రజలను యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేటట్లు చర్యలు తీసు కోవాలని, జూన్, 21వ తేదీన ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో లక్ష ప్రదేశాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక కేంద్రాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో యోగాంధ్ర పోటీలు నిర్వహించాలన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం అనంతరం కూడా యోగాను ప్రతీ ఒక్కరూ కొనసాగించేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాల న్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం యోగాంధ్ర -2025 క్యాంపెయిన్ విజయవంతం చేయడంతో పాటు యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్, ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. (తరువాయి 4లో...)

# లో గ్రేడ్ కొనుగోలు చేస్తేనే రైతులకు గిట్టుబాటు





కోలుకునే పరిస్థితి లేదన్నారు. కొనుగోళ్ల ప్రక్రియ, మార్కెట్ ధరల గురించి వేలం నిర్వహణ అధికారి జె తులసి, ఐటీసి, ఇతర కంపెనీల ప్రతినిధులతో శ్రీనివాసరావు చర్చించారు. మరోవారం రోజుల్లో విదేశీ ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని లో గ్రేడ్ కొనే వీలుందని వేలం అధికారిణి పేర్కొన్నారు. ఈ అంశం పై శ్రీనివాసరావు తీవ్రంగా స్పందిస్తూ వ్యవసాయ శాఖ మంత్రి నుంచి ముఖ్య మంత్రి వరకు హామీలు ఇస్తూనే ఉన్నారని, ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. మిర్చి రైతులకు ఇచ్చిన మద్దత్తు ధర హామీ అమలు కాలేదని ఈ సందర్భంగా గుర్తు చేసారు. ఈ ప్రభుత్వానికి రైతులపట్ల ఎటువంటి ప్రేమ లేదన్నారు. అప్పుల పాలై పొగాకు రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, ఇటీవల మార్టూరు పర్యటించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు సమీపంలో ఆత్మహత్యచేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శించేందుకు మనసు రాలేదని విమర్శించారు. పొగాకు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని, గిట్టుబాటు ధర లభించక, 30 శాతం పొగాకును కొనుగోలు కు నిరాకరిస్తూ ఒక వైపు బోర్డు, మరో వైపు ఐటీసి పొగాకు రైతులతో జూదమాడుతున్నాయని ఆరోపించారు. ఐటిసి వంటి కంపెనీల గుత్తాధిపత్యం పత్యం వల్ల పొగాకు ధరలు రోజు రోజుకు పతనం అవుతున్నాయని, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రైతులు దివాలా తీసే పరిస్థితి వచ్చిందన్నారు. రైతులు పోరాడి సాధించుకున్న టాబాకో బోర్డు ను లేకుండా చేయాలని కంపెనీలు కుట్ర చేస్తున్నట్లు విమర్శించారు. పొగాకు రైతులను గట్టెక్కించవలసిన భాద్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వం ట్రేడర్స్ తో చర్చించాలని, ఎస్ టిసి ద్వారా కనీసం 25శాతం పొగాకు కొనుగోలు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం రంగంలోకి దిగితే కంపెనీలు కొనుగోలు కు పోటీలో ఉంటాయని, తక్షణమే ప్రభుత్వం ఎస్ టి సి కి రూ 300 కోట్లు కేటాయించి కొనుగోలు చేయించాలని వారు డిమాండ్ చేసారు. గిట్టుబాటు ధర కోసం రైతులు ఐక్యమై పోరాటం చేయాలని సూచించారు. రైతులకు తాము అండగా నిలుస్తామని వారికి భరోసా ఇచ్చారు. రైతుల సమస్యలపై తాము ప్రభుత్వంతో చర్చించనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. వేలం కేంద్రం సందర్శించినవారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు, కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, రైతు సంఘ అధ్యక్ష కార్యదర్శులు జయంతి బాబు, పమిడి వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు, కిలారి పెద్దబ్బాయి, బెజవాడ శ్రీనివాసరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య, ఉపాధ్యక్షులు టి శ్రీకాంత్, గోగినేని బసవ పున్నయ్య, కొల్లూరి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

# యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్, ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

అలాగే యోగ పై ర్యాలీలు, కాంపిటీషన్స్ నిర్వహిస్తూ యోగ పై విస్తృతంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి జిల్లా కు కేటాయించిన పీఎం సూర్య ఘర్ లక్ష్యాలని పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చుపాలన్నారు. విద్యుత్, ఇసుక, ఎన్టిఆర్ వైద్య సేవలు, దేవాలయాలలో మౌలిక సదుపాయాలు, మునిసిపల్ సేవలపై వచ్చిన ప్రజా స్పందనలపై సిఎస్ సమీక్షిస్తూ, ప్రభుత్వ ప్రధకాల అమలు తీరుపై వచ్చే ప్రజా స్పందనలపై తేలికగా తీసుకోకుండా జిల్లా కలెక్టర్లు సమీక్ష చేసి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. ఒంగోలు కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, హౌసింగ్, డిఆర్డిఎ, మెప్మా పిడీలు శ్రీనివాస ప్రసాద్, నారాయణ, శ్రీహరి, విద్యుత్ శాఖ ఎస్.ఈ వెంకటేశ్వర రావు, సెట్నల్ సిఈఓ శ్రీమన్నారాయణ, డిఎస్ డిఓ రాజేశ్వరి, దివ్యాంగుల శాఖ ఏడి అర్చన తదితరులు పాల్గొన్నారు. అంతకముందు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, సంబంధిత అధికారులతో సమావేశమై జిల్లాలో జరుగుతున్న యోగాంధ్ర -2025 క్యాంపెయిన్, పీఎం సూర్య ఘర్ లక్ష్యాల పురోగతిపై సమీక్షించి తగిన సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు కందుల, దామచర్ల

ఆలయ నిర్వాహకులు, అర్చకులు సాదర స్వాగతం పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఒంగోలు నియోజకవర్గ టిడిపి నాయకులు, మహిళా నాయకురాళ్ళు పాల్గొన్నారు.



# సామాజిక సేవా కార్యక్రమాలకు మలబార్ గ్రూప్ రూ.150 కోట్లు కేటాయింపు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)**

2025-26 సంవత్సరంలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించడానికి రూ.150 కోట్లు మలబార్ గ్రూప్ కేటాయించింది. 'వరల్డ్ హంగర్ డే' సందర్భంగా, భారతదేశం, జాంబియా దేశాల్లో ప్రతిరోజూ 70,000 భోజనాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది.

మలబార్ 'హంగర్ ఫ్రీ వరల్డ్' పథకంలో భాగంగా 2025-26 సంవత్సరంలో మొత్తం 2.50 కోట్ల భోజనాలు ఉచితంగా అందించాలని నిర్ణయించారు. 'హంగర్ ఫ్రీ వరల్డ్' పథకం ప్రారంభించి నప్పటి నుంచి, గత 3 ఏళ్లలో, 2.5 కోట్ల భోజనాలు నిరుపేదలకు అందించబడ్డాయి. తమ వార్షిక సి.ఎస్.ఆర్ బడ్జెట్లో 60 శాతం నిధులను, నిరుపేదల ఆకలి తీర్చడం, పేదరికాన్ని నిర్మూలించడానికి ఉద్దేశించిన కార్యక్రమాల మలబార్ గ్రూప్ కేటాయించింది. సమాజానికి మంచి చేయాలనే మలబార్ గ్రూపు నిబద్ధతను బలోపేతం చేస్తుంది. ఇందులో భాగంగా ఒంగోలులో నగర మేయర్ గంగాడ సుజాత ఫుడ్ పంపిణీ చేసే వెహికల్ని ప్రారంభించారు.

# సిఐటియు కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)**

సిఐటీయూ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఒంగోలు సిఐటియు కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు. 1970లో ఏర్పడిన సిఐటియు నిరంతర ఐక్యత, పోరాట నినాదంతో పనిచేస్తుందన్నారు. 1970 ప్రాంతంలో అప్పటి పాలకవర్గాలు ఉద్యోగులుపై, కార్మికులపై,ప్రజల పట్ల వ్యవహరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు ఆవిర్భావం జరిగింది. సిఐటియు ఆవిర్భావం జరిగిన తర్వాత దేశవ్యాప్తంగా ఉద్యోగుల్ని కార్మికుల్ని ఐక్యం చేయడంలో ఒక కీలకమైన పాత్ర సిఐటియు పోషించిం దన్నారు. 1980 తర్వాత మరల భారతదేశంలో పరిస్థితులు మారుతున్నాయి. తర్వాత నూతన ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత భారతదేశంలో కార్మిక వర్గ పరిస్థితులు మరింత దుర్భరంగా మారింది.నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించడంలో సిఐటియు కీలక పాత్ర వహించిందన్నారు. 1990 నుంచి 2024 వరకు దాదాపు 22 దేశవ్యాప్తి సమ్మెలు. నిర్వహించి అనేక కోట్ల మంది ఉద్యోగులని కార్మికుల్ని ఈ వైపు తీసుకురావడం జరిగింది. ఒక సిఐటియుఏ కాకుండా దేశంలో ఉన్న అనేక కార్మిక సంఘాలు అనేక అభ్యుదయ సంఘాలు వారందరితోటి ఐక్యంగా ఉండి వాళ్ళందరిని కూడా ఈ విధానాల వైపు వ్యతిరేకించే దిశగా తీసుకు రావడం సిఐటియు ఒక ప్రత్యేకత అని చెప్పుకోవచ్చు. నేడు భారతదేశంలో 11 ఏళ్ల మోడీ పరిపాలనలో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోర్టు తీసుకురావడం జరిగింది. ఈ నేపథ్యంలో సిఐటియు లేబర్ కోడ్స్ వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేసినది. ఇప్పటివరకు కూడా నాలుగేళ్ల ఆమోదం తర్వాత అమలు గాని పరిస్థితి మనం చూస్తా ఉన్నాం. అమలు కావడం లేదు అంటే ఉద్యోగులకు కార్మికుల ప్రతిఘటన తీవ్రంగా ఉంది అనే అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ 2025 ఏప్రిల్ నుంచి అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు సర్కులర్ పంపినటువంటి కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తుంది. దీని నేపథ్యంలో లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ మొత్తం సమ్మె నిర్వహించాలని చెప్పి సిఐటియు ఇతర కార్మిక సంఘాలు నిర్ణయం తీసుకున్నది. సిఐటియు ఏర్పడిన తర్వాత నివాస ప్రాంతాల్లో పని ప్రదేశాల్లో సిఐటియు కృషి అమోఘమైన కృషి చేయడం జరిగింది కోట్ల మంది ఉద్యోగులు కార్మికులు సిఐటియు ద్వారా లబ్ది పొందినటువంటి పరిస్థితి మనం చూస్తాం ం. వీరే కాకుండా శ్రామిక మహిళను అంగన్వాడీ ఆశ మధ్యాహ్నం భోజనం స్కీం వర్కర్స్ గా గుర్తించాలని నిరంతరం వాళ్ళ ఎదుర్కొన్న సమస్యల మీద సిఐటియు రాజీలేని పోరాటం చేస్తా ఉంది ఇప్పటికీ కొనసాగిస్తుంది. 90 తర్వాత కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానం వలన కోట్ల సంఖ్యలో అలాంటి చిరు ఉద్యోగులు ఏర్పడిన పరిస్థితి వారందరినీ రెగ్యులర్ చేయాలని నిరంతర పోరాటాలు చేస్తావుంది అలానే ప్రభుత్వ రంగ పరిశ్రమలైనటువంటి ఎల్ఐసి బ్యాంకు పోస్టులు టెలికం రైల్వే కోల్ ఇలా ఈ రంగాల్లో ప్రభుత్వ రంగం ఉండాలని చెప్పి నిరంతరం పోరాటాలు ఆందోళన చేస్తున్నాం. చివరగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ రక్షించుకోవడానికి 1500 రోజుల నుంచి నిరంతర పోరాటాలు చేస్తున్న ఘనత ఒక సిఐటియుదే. ఒక సిఐటియు పోరాటాలే కాదు దేశంలో ఉన్న కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడంలో పోరాటాలు నిర్వహించడంలో ప్రభుత్వ విధానాల్ని తెలియజేయడంలో ఒక కీలకమైన పాత్ర సిఐటియు పోషిస్తా ఉంది . సిఐటియు కార్యాలయం వద్ద జెండాని ఆవిష్కరించడం జరిగింది. ఈ జెండా కార్యక్రమంలో సమన్వయకర్తగా శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పీ కల్పన సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి మహేష్ , సిఐటియు ఆఫీస్ ఇన్చార్జి పోకల ప్రసాదు, పోకల కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు మున్నాభాష, సిఐటియు నగర నాయకులు తంబి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారులను ఆశీర్వదించిన మంత్రి డోలా, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య

**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 30)**

కొండపి సీతారామ కళ్యాణ మండపంలో జరిగిన కొండపి గ్రామానికి చెందిన కూనమనేని శంకర్ వాసంతి దంపతుల కుమారులు సాయి ప్రవీణ్ సాంకేతే పంచకట్టు వేడుకలకు మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. వారి వెంట మండల నాయకులు పాల్గొన్నారు.



# జెడ్పీ పాఠశాలను సందర్శించిన జిల్లా సమగ్ర శిక్ష, సహిత విద్య సమన్వయకర్త ఐఈకో ఆర్డినేటర్ పి నాగేంద్ర నాయక్



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 30)**

మే 30న మార్కాపురం మండలంలోనే జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాలను ప్రకాశం జిల్లా సమగ్ర శిక్ష, సహిత విద్య సమన్వయకర్త ఐఈకో ఆర్డినేటర్ పి నాగేంద్ర నాయక్ సందర్శించి ఈ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేయబోతున్న ఆటిజం కేంద్ర తరగతి గదులను స్కూల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం స్కూల్ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మార్కాపురం మండలంలో ఐఈఆర్పిలు నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యార్థుల గుర్తింపు పాఠశాలలో విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగింది. పిల్లల తల్లిదండ్రులకు పిల్లల లోపం గురించి అడిగి వారికి సూచనలు,సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి నాగేంద్ర నాయక్, ఐఈఆర్ పి లక్ష్మీదేవి, మాలిక్, పాల్గొన్నారు.

# పొగాకు రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది



**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**
**పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పిస్తాం**
**చివరి ఆకు వరకు రైతులు పండించిన పొగాకు పంటను**
**కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది**
**ఎవరో వచ్చి చెప్పే మాయ మాటలను రైతులు నమ్మవద్దు**
**పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులు,**
**బయ్యర్ల మీటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 30)

పొగాకు రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఉదయం పామూరు రోడ్‌లోని 27వ నెంబర్ పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. రైతులు, బయ్యర్ల సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ధరలపై మాట్లాడారు. పొగాకు రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. చివరి ఆకు వరకు రైతులు పండించిన పొగాకు పంటను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఎవరో వచ్చి చెప్పే మాయ మాటలను రైతులు నమ్మవద్దన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గతంలో కిలో పొగాకు ప్రారంభం 230 నుంచి 300 వరకు ఉండేదని ప్రస్తుతం 280 నుంచి రాను రాను ధర తగ్గిపోతుందని తెలిపారు. గత ఏడాది లోగో రెడ్డి ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారని, ప్రస్తుతం లోగ్రేడ్ కొనుగోలు చేయక పోవడంతో బోర్డుకు తెచ్చి తిరిగి వెనక్కి తీసుకెళ్తున్నామని రైతులు ఎమ్మెల్యేతో తెలిపారు. రైతులు సమస్యలు విన్న ఎమ్మెల్యే కొనుగోలుదారులైన కంపెనీ ప్రతినిధులతో ఫోన్లో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయరన్న భయం రైతులలో ఉన్నదని పర్సంటేజీలు పెంచి అన్ని రకాలుగా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే రైతులు, బయ్యర్లు, బోర్డు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పొగాకు కొనుగోలకు కృషి చేయాలని కోరారు. రైతులు బాగుంటేనే కంపెనీలు, కంపెనీలు బాగుంటేనే మీరు ఇలా ఒకరికి ఒకరు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చివరి ఆకు వరకు రైతులు పండించిన పొగాకు పంటను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని రైతులెవరు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే రైతులకు భరోసా ఇచ్చారు. ఎవరో వచ్చి చెప్పే మాయ మాటలు రైతులను నమ్మవద్దని కూటమి ప్రభుత్వంలో నారా చంద్రబాబునాయుడు పొగాకు రైతులను గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటి నరసింహం, రమణయ్య, వడ్లమూడి రామకృష్ణ, అత్తంటి శ్రీహరి నాయుడు, బోర్డు అధికారులు రైతులు పాల్గొన్నారు.

## హిందువులుగా పుట్టడం మన అదృష్టం

**హిందుత్వాన్ని కాపాడడం మన ధర్మం**





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మే 30)

బాపట్ల మండలం నందిరాజు తోట ఎస్ టి కాలనీ లో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి చెట్టు దగ్గర పూజ నిర్వహించి సమీపంలోని మహిళలకు పండు తాంబూలం తో గిఫ్ట్ లు అందజేసిన బండ్రెడ్డి రజని. రజిని మాట్లాడుతూ..... హిందువులుగా పుట్టడం మన అదృష్టమని హిందుత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని ప్రతి ఒక్కరు దైవ భక్తి అలవర్చుకోవాలని,హింధుత్వం మన నైజమని,పిల్లలకు చిన్న వయసులోనే సేవా కార్యక్రమలు అలవాటు చేయాలని బంధాలు బంధుత్వల విలువలు గురించి పిల్లలకు తెలియపరచాలని,వారికి మంచి విద్య బుద్ధులు చెప్పించాలని మహిళలకు తెలియచేసారు.ప్రతి ఒక్కరు మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని బండ్రెడ్డి రజిని కోరారు.

## కిశోరి వికాసం వేసవి శిక్షణ పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 30)

మండలంలోని మార్కొండాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా "ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు" అంశంపై కిశోరి బాలికలు, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.వి.ఎస్ పార్వతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్వతి మాట్లాడుతూ వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి, భవిష్యత్తు అవసరాలను తీర్చడానికి పొదుపు ఒక ముఖ్యమైన ప్రక్రియ అని, దీనిని అనుసరించడం ద్వారా వ్యక్తులు తమ ఆర్థిక భవిష్యత్తును మెరుగు పరుచుకోవచ్చన్నారు. భవిష్యత్తు అవసరాలను తీర్చడానికి,అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి, పెట్టుబడి పెట్టడానికి ఉపయోగపడుతుందన్నారు. మీరందరూ పొదుపు గ్రూపులో చేరి పొదుపు చేయాలని, 18 సంవత్సరాల నిండు వరకు బాలికలకు పెళ్లిళ్లు చేయద్దన్నారు. యోగాంధ్ర- 2025 మాసోత్సవాలలో మీరందరూ యోగా, ధ్యానంలో పాల్గొని, మీ శారీరక ఆరోగ్యం ,మానసిక శ్రేయస్సు, సమతుల్యత, ఒత్తిడి తగ్గింపును సాధించవచ్చునన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా లీడర్ సౌందర్య, కిశోరి బాలికలు, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలను ఖరీఫ్ సాగుకు ముందే చేయించుకోవాలి

**కెవికె నోడల్ ఆఫీసర్ డాక్టర్ టీ వెంకటేశ్వరరెడ్డి**

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, మే 30)

మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ-ఖరీఫ్ కార్యక్రమాన్ని కె.వి.కె నోడల్ ఆఫీసర్ డా. టీ. వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌కు రైతులు ఏవిధంగా శాస్త్రవేత్తల సలహాలతో చేసుకోవాలో తెలిపారు. అదేవిధంగా కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాల గురించి ఈ కార్యక్రమం ద్వారా తెలిపారు. భూసార పరీక్షలను ఖరీఫ్ సాగుకు ముందే




చేయించుకొని ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవ్వాలని సూచించారు. డాక్టర్ టి.వెంకటేశ్వర రెడ్డి, సేద్య విభాగం శాస్త్రవేత్త మాట్లాడుతూ., ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు ముందుగా వారి వారి పొలాలను లోదుక్కులు చేపట్టాలని, దీని ద్వారా భూమి నుండి ఆశించే వేరుకుళ్ళు తెగుళ్ళ నుంచి పంటలు రక్షించుకోవచ్చునని, అంతేకాకుండా కలుపును కూడా సమర్థవంతంగా అరికట్టవచ్చునని తెలిపారు. అదేవిధంగా పత్తిలో వచ్చే ఎండు తెగులు, మిరపలో వేరుపురుగు, కందిలో కాయ ఈగ, మారుక మచ్చల పురుగు నివారణకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను వివరించారు. మార్కాపురం ఏ.డి.ఏ బాలాజీ నాయిక్ మాట్లాడుతూ ఈ పంట నమోదు, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే వివిధ పథకాల వివరాలను తెలిపారు. మండల వ్యవసాయ అధికారి డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖాళీగా ఉన్న భూములలో ఫారెస్ట్ జాతికి లేదా ఉద్యానవన పంటలను సాగు చేసువడం వల్ల భూతాపని తగ్గి, వర్షాలు సకాలంలో కురావటానికి దోహదపతాయని తెలిపారు దీనితో పాటు భూమిలో సేంద్రియ కర్భనం పెరగటానికి ఆష్కారం ఉంటుందని తెలిపారు. రైతులకు 50% సబ్సిడీ లో పచ్చరొట్టే ఎరువులకు సంబందించిన విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఉద్యానవన అధికారి డి. రమేష్ మాట్లాడుతూ ఈ గ్రామాలలో ఏఏ పంటలు అనుకూలంగా ఉంటాయి, ఏ పంటలను సాగు చేసుకోవాలి, వాటిలో యాజమాన్య పద్ధతులను ఎలా చేపట్టాలో తెలియజేశారు. అదేవిధంగా యే ఉద్యానవన పంటలకు సబ్సిడీ వస్తుంది, అవి ఎవరికి వర్తిస్తాయో తెలిపారు. రైతులకు వివిధ సీజనలో అవసరమైన రైతు శిక్షణా కార్యక్రమాలను అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా ఆయా అనుబంధ శాఖల అధికారులు ఈ కార్యక్రమం ద్వారా వారు అందించే సేవలను గురించి రైతులకు క్లుప్తంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు స్వయంగా వారి వారి సమస్యలను నేరుగా అధికారులకు వివరించి వారి సమస్యలకు పరిష్కారాని పొందగలిగారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు కంభం, అర్ధవీడు, పెద్దారవీడు, తిప్పాయపాలెం గ్రామ సెక్రటరీ వీఏఏ, వివిధ అనుబంధ శాఖల అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

# వినుకొండలో 26 కంపెనీలతో మెగా ఉద్యోగ మేళా

**నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలి**

**ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు**

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 30)



జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం వినుకొండలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి టెక్ మహీంద్రా, డైకిన్, అప్స్‌టెక్ సొల్యూషన్స్, అమర్‌రాజా, ముత్తూట్ ఫైనాన్స్, హీరో మోటో కార్ప్, హెటిరో, అపెక్స్ సొల్యూషన్స్, మెడ్‌ప్లస్, ఎస్‌బీఐ కార్డు సహా 26 సంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఎవరైనా ఈ అవకాశం సద్వినియో గం చేసుకోవచ్చన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మేళా కొనసాగుతుందని, 18- 40 ఏళ్లలోపు నిరుద్యోగులు బయోడేటా, సర్టిఫికేట్లతో నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. ఐటీ, ఫైనాన్స్, పరిశ్రమలు, తయారీ, సాఫ్ట్‌వేర్, రిటైల్ రంగాల్లో ఉద్యోగ అవకశాలు కల్పిస్తారన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం లభిస్తుందని, చదువుకున్న యువతీ యువకులు ఈ జాబ్‌మేళాను ఉపయోగించుకోవాలని కోరారు. వినుకొండ ప్రాంతంలో చదువుకు న్న ప్రతిఒక్క యువతీయువకులకు ఉద్యోగాలు ఇప్పించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నానని తెలిపారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగానే వినుకొండలో ఈ ఉద్యోగ మేళా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి 6 నెలలకోసారి ఉద్యోగ మేళా పెట్టించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.



## జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కొవిలంపాడు గ్రామ సర్పంచ్ బుజ్జి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)

టీబీ ముక్త భారత్ అభియాన్ అవార్డును జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ చేతుల మీదుగా కోవిలంపాడు గ్రామ సర్పంచ్ బుజ్జి అందుకున్నారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసింది. అందులో భాగంగా సీఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామపంచాయతీని టిబీ రహిత గ్రామ పంచాయతీగా ఎన్నిక చేశారు. గతంలో జిల్లా వైద్యాధికారులు జిల్లాలో సర్వే చేపట్టారు. చేపట్టిన సర్వేలో కోవిలంపాడు గ్రామపంచాయతీలో ఎటువంటి టిబీ కేసులు లేనందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ చేతుల మీదుగా అవార్డులను అందుకోవటం జరిగిందని గ్రామ సర్పంచ్ బుజ్జి తెలిపారు.

# టిబి వ్యాధిని నిర్మూలించడం అందరి బాధ్యత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)

ఈ నెల 28వ తేదీన ప్రకాశం భవనంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో టి.బి.ఫోరమ్ , టి.బి. ముక్తి భారత్ అభినయన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టి.బి.ముక్తి భారత్ అభియాన్ వాల్ పోస్టర్లును జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ క్షయవ్యాధి సంభవం, మరణాల రేటుపై గణనీయమైన ప్రభావాన్ని చూపే లక్ష్యంతో, అన్ని రాష్ట్రాలలోని అన్ని జిల్లాల్లో ఇంటెన్సిఫైడ్ టిబి క్యాంపెయిన్‌ను విస్తరిస్తోందన్నారు. టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా, టిబి భారం ఎక్కువగా ఉన్న గ్రామాలపై దృష్టి సారించడానికి ఒక క్రమానుగత విధానాన్ని అవలంభించాలన్నారు. ఇంటెన్సిఫైడ్ టిబి క్యాంపెయిన్ మధుమేహ వ్యాధిగ్రస్తులు, పోషకాహార లోపం ఉన్నవారు, ధూమపానం చేసేవారు, మద్యపానం చేసేవారు. గతంలో టిబి ఉన్నవారు , వారి దగ్గరి పరిచయస్తులపై టిబి స్క్రీనింగ్ దృష్టి పెట్టాలన్నారు. 2023లో ప్రకాశం జిల్లాలో టిబి రహిత పంచాయతీగా గుర్తించిన ఏడు పంచాయితీలకు కాంస్య విగ్రహం, 2024 సంవత్సరంలో సిల్వర్ విగ్రహాలను ఏడు పంచాయితీలకు సంయుక్త




కలెక్టర్ చేతులమీదుగా ఇవ్వటం జరిగింది. మిగిలిన 65 పంచాయితీలకు కాంస్య బహుమతులను ప్రదానం చేయటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టి.బి.వ్యాధిపై అనుమానం ఉన్న ప్రజలందరూ టి.బి. స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని, దీని ద్వారా టి.బి.రహిత సమాజాన్ని నిర్మించాలని తెలిపారు. జిల్లా లెప్రసీ. ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ టిబి వ్యాధిని నిర్మూలించడం అందరి బాధ్యత అన్నారు. టీబీ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. టిబి వ్యాధిని నిర్మూలించడంలో పంచాయతీ రాజ్, పిడి-డిఆర్‌డిఎ, పిడి-మెప్మా వంటి అన్ని ఇతర శాఖల అధికారులు సహాయ సహకారము తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ ఉపిరితిత్తుల విభాగము అధిపతి డాక్టర్ రంజిత్ బాషా, ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఉపిరితిత్తుల విభాగము అధిపతి డాక్టర్ జహంగీర్ సుల్తాన్, గ్రామ సర్పంచులు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్. మరియు టిబి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు,

# నిరుపేదలకు అండగా కూటమి ప్రభుత్వం

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

27 మంది బాధితులకు రూ.24.56 లక్షలు చెక్కుల పంపిణీ







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 30)

కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 27 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 24.56 లక్షల రూపాయల చెక్కులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు పేర్కొన్నారు. పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిది వరం లాంటిదని, రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల వైద్య విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాకుండా ఉండే జబ్బులకు వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేస్తున్నారని, ఇటువంటి మంచి ప్రభుత్వాన్ని గెలిపించుకున్నందుకు ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులందరూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహ, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, నాదేళ్ల వెంకట సుబ్బారావు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆ దారిలో వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే..!





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 30)

కొండపి నుంచి టంగుటూరు వెళ్లే ప్రధాన రహదారిలో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిందేనని ప్రజలు అంటున్నారు. రోడ్డు వెంబడి చెత్త చెదారాలతో దుర్వాసన వెదజల్లుతుంది. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్న షాపు యజమానులో ఎటువంటి మార్పు రావట్లేదు. రోడ్డుకు ఆనుకుని రెస్టారెంట్, చికెన్ షాపు, బ్రాందీషాపు ఉండటంతో షాపు యజమానులు రోడ్డుపై చెత్త పారవేస్తున్నారు. రోడ్డుపై చెత్త పేరుకు పోయి దుర్వాసన వెదజల్లుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు వెంబడి చెత్తను తొలగించాలని కొండపి మండల ప్రజలు కోరుతున్నారు.

# ఐక్య పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులు కాపాడుకోవాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 30)

ఐక్య పోరాటాల ద్వారానే హరించివేయబడుతున్న కార్మిక హక్కులను కాపాడుకోగలమని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం రమేష్ అన్నారు. శుక్రవారం సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటియు జెండాను పొదిలిలో మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఐక్యతా పోరాటం నినాదంతో 1970లో ఏర్పడిన సిఐటియు నాటి నుండి నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాల ద్వారా తిప్పకొట్టడంలో అగ్రభాగాన నిలిచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అలుపులేని పోరాటాలు సాగిస్తుందన్నారు. ప్రకృతి వనరులను ,సహజ సంపదను పాలకవర్గాలు కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని అడుగడుగునా అడ్డుకుంటుందన్నారు. కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం కోసం, కనీస వేతనాలు అమలుకోసం రాజీలేని పోరాటాలు నడుపుతుంది. వెట్టిచాకిరీ చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ ఆయాలు,ఆశా,అంగన్వాడీ, విఓఎ, స్వచ్ఛ భారత్ కార్మికులు లాంటి స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత కోసం సమరశీల ఉద్యమాలు నడుపుతూ పాలకులకు ముచ్చెమటలు పట్టించడంలో సిఐటియు కృషి మరువలేనిదన్నారు. ముఠా, బిల్డింగ్, ట్రాన్స్ పోర్ట్, గిగ్, షాప్ ఎంప్లాయిస్, వీధి వ్యాపారులు, మెకానిక్స్ లాంటి అసంఘటిత రంగ కార్మికులు సంక్షేమానికి సమగ్ర చట్టం కోసం నిరంతరం పోరాడుతూ ఉందన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సంఘటిత పోరాడుతుందన్నారు. శతాబ్దాలతరబడి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను, కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ పేరుతో రద్దు చేస్తుంటే సమరశీల ఐక్యం పోరాటాలతో తిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉందన్నారు. 8 గంటల పని విధానానికి తూట్లు పొడిచే కార్పోరేట్ శక్తుల కుయుక్తులను తిప్పకొట్టడానికి కార్మికులు సిద్దం కావాలన్నారు. కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడం ద్వారా భారతదేశంలో కార్మికుల హక్కులను పరిరక్షించడానికి సిఐటియు నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి సుబ్బయ్య, కెవి నరసింహం, జి నాగేశ్వరరావు, హనుమంతు, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

# యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్, ట్రైనర్ల శిక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)




యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్, ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాల పై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం సాయంత్రం విజయవాడ ఏపీ సచివాలయంలోని సి.ఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జిల్లా కలెక్టర్లతో వర్చువల్ గా సమావేశమై యోగాంధ్ర -2025 క్యాంపెయిన్, పీఎం సూర్య ఘర్ అమలు, వివిధ ప్రభుత్వ పథకాల సేవల పట్ల ప్రజా స్పందనలు వంటి అంశాల పై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 2.20 కోట్ల మంది ప్రజలను యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేటట్లు చర్యలు తీసుకోవాలని, జూన్, 21వ తేదీన ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో లక్ష ప్రదేశాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక కేంద్రాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో యోగాంధ్ర పోటీలు నిర్వహించాలన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం అనంతరం కూడా యోగాను ప్రతీ ఒక్కరూ కొనసాగించేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం యోగాంధ్ర -2025 క్యాంపెయిన్ విజయవంతం చేయడంతో పాటు యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్, ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే యోగ పై ర్యాలీలు, కాంపిటీషన్స్ నిర్వహిస్తూ యోగ పై విస్తృతంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి జిల్లా కు కేటాయించిన పీఎం సూర్య ఘర్ లక్ష్యాలని పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చుపాలన్నారు. విద్యుత్, ఇసుక, ఎన్టిఆర్ వైద్య సేవలు, దేవాలయాలలో మౌలిక సదుపాయాలు, మునిసిపల్ సేవలపై వచ్చిన ప్రజా స్పందనలపై సిఎస్ సమీక్షిస్తూ, ప్రభుత్వ ప్రధకాల అమలు తీరుపై వచ్చే ప్రజా స్పందనలపై తేలికగా తీసుకోకుండా జిల్లా కలెక్టర్లు సమీక్ష చేసి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. ఒంగోలు కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ శ్రీ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య




శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, హౌసింగ్, డిఆర్డిఎ, మెప్మా పిడీలు శ్రీనివాస ప్రసాద్, నారాయణ, శ్రీహరి, విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరావు, సెట్నల్ సిఈఓ శ్రీమన్నారాయణ, డిఎస్ డిఓ రాజేశ్వరి, డివ్యాంగుల శాఖ ఏడి అర్చన, తదితరులు పాల్గొన్నారు. అంతకముందు జాయింట్ కలెక్టర్ శ్రీ ఆర్ గోపాల క్రిష్ణ, సంబంధిత అధికారులతో సమావేశమై జిల్లలో జరుగుచున్న యోగాంధ్ర -2025 క్యాంపెయిన్, పీఎం సూర్య ఘర్ లక్ష్యాల పురోగతిపై సమీక్షించి తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.

# చిరుమామిళ్లను సన్మానించిన ఉద్యోగ సంఘాలు

(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, మే 30)

వైద్యఆరోగ్య శాఖలో సుమారు 35 ఏళ్ల పాటు వివిధ హోదాలలో పనిచేసి వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంటుగా ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ చేస్తున్న చిరుమామిళ్ల శ్రీనివాసరావును ఉద్యోగ సంఘాల నాయకులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో అంకితభావంతో విధులు నిర్వహించి తోటి సిబ్బందికి శ్రీనివాసరావు ఆదర్శంగా నిలిచారని ఉద్యోగ సంఘాల నాయకులు ఏపీ ఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్, చీరాల తాలూకా అధ్యక్షులు సిహెచ్ శేషుబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వై.స్వాతి కిరణ్, సాయి వైష్ణవి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొని చిరుమామిళ్ల శ్రీనివాసరావుతో పనిచేసిన అనుభవాలను వారు పంచుకున్నారు. 21







# వైకాపాకు దోపిడీ, అవినీతి పై ఉన్న శ్రద్ధ ప్రజల అవసరాలపై లేకపోయింది

## నూజండ్ల కేజీబీవీ భవనం శంకుస్థాపనలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 30)

గడిచిన వైకాపా ప్రభుత్వానికి దోపిడీ, అవినీతిపై ఉన్న శ్రద్ధ ప్రజల అవసరాలపై లేక పోయిందని, విద్యార్థుల నుంచి రైతుల వరకు ఎదుర్కొంటున్న ఇబ్బందులే నిదర్శమన్నారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. నూజండ్ల మండలంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. నూజండ్లలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదులు, వసతిగృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.1.85 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో రూ.15 లక్షలతో లేఅవుట్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టి ఆడబిడ్డలు బాధపడకూడదని, బాగా చదువుకోవాలని, వసతులన్నీ నెంబర్ వన్‌గా ఇవ్వాలని ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తిచేయలేకపోయారని, బాలికలకు అదనపు వసతిగృహం కూడా నిర్మించలేకపోయారని మండిపడ్డారు. అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగానే అధికారులను ఆదేశించారు. తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన జగన్‌రెడ్డికి మాటలు తప్ప చేతల్లేవన్నారు. జాబ్ క్యాలెండర్ అని చెప్పి జాబ్ లెస్ రాష్ట్రంగా చేశారని, సీఎం చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేస్తున్నారన్నారు. పీఈటీలనూ నియమించి వ్యాయామంలో కూడా పిల్లలను బ్రహ్మాండంగా తీర్చిదిద్దబోతున్నారని తెలిపారు. ఊసుపోక విమర్శలు చేస్తున్న జగన్ ఏడాది లోపే ఇచ్చిన హామీల్లో ఇన్ని అమలు చేసిన రాజకీయ పార్టీ ఎక్కడైనా ఉంటే చూపించమని సవాల్ చేశారు. జగన్‌లా ఏడాదికి రూ.250 చొప్పున పెంచుకుంటూ పోలేదని, ఒక్క సంతకంతో 3వేల పింఛన్‌ను 4వేలు చేసి ప్రతినెలా ఒకటో తేదీనే అందిస్తున్నాం అన్నారు.

పేదలకు అన్నం పెట్టే అన్నక్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేస్తే ఎన్డీఏ ప్రభుత్వం రాగానే తెరుచుకున్నాయని తెలిపారు. జూన్ 12 నుంచి తల్లికి వందనం అమలు చేయబోతున్నామని, ప్రతిబిడ్డకు రూ.15 వేల చొప్పున అందిస్తామన్నారు. దీపం పథకం కింద 3ఉచిత సిలిండర్లు అందుతున్నాయని, సిలిండర్లు తీసుకోకపోతే ముందుగానే నగదు అందజేస్తున్నామని తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున ఇస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కానుందన్న జీవీ ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 24 వేల కిలోమీటర్ల మేర గ్రామాల్లో రోడ్లు వేశామని, గత ఐదేళ్లలో వైసీపీ ఏం చేసిందని ప్రశ్నించారు. రూ.861 కోట్లతో 20 వేల కి.మీ రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దామని చెప్పారు. నాబార్డు నిధులతో 1,246 కి.మీ. జిల్లా ప్రధాన రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.1.2 లక్షల కోట్లతో జాతీయరహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, అధికారులు, నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

**జూన్ నుంచే రేషన్ దుకాణాల్లో నిత్యావసరాలు:**

జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే డీలర్ల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు డీలర్ల ద్వారా ఇళ్ల వద్దనే నిత్యావసరాలు తీసుకెళ్లి అందిస్తామన్నారు. పేదలకు అందిస్తున్న నిత్యావసరాలు పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టామని, తప్పుచేసిన డీలర్లపై కఠిన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు.

**కాలిపోయిన వారికి కూడా ఇళ్లు ఇవ్వలేదు:**

కమ్మరిపాలెం లేఅవుట్‌కు శంకుస్థాపన అనంతరం మాట్లాడిన జీవీ గత వైసీపీ పాలకులు ఎస్సీ, ఎస్టీలకు సరిగా ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవని, ఐదేళ్లలో ఇళ్లు కాలిపోయిన వారికి కూడా కనీసం ఇళ్లు ఇవ్వలేని దుస్థితి చూశామన్నారు. ఐదేళ్లలో ఇళ్లు కాలిపోయిన వారికి ప్రాధాన్యత ఇచ్చి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఎస్టీల కోసం కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఎస్టీ కాలనీలోని పిల్లల ప్రత్యేక బాధ్యత తీసుకుని వారి చదువులను ప్రోత్సహిస్తామని చెప్పారు. డిగ్రీ, పీజీలు చదివే వారికి శివశక్తి ఫౌండేషన్ ద్వారా అండగా ఉంటామన్నారు.

**కడపలో తెలుగుదేశం మహానాడు సూపర్‌హిట్**

కడపలో తెలుగుదేశం పార్టీ మహానాడు కనీవినీ రీతిలో అత్యంత అద్భుతంగా జరిగిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ స్పందన లభించిందన్నారు. కడప మొత్తం పసుపుమయం అయిందన్నారు. లక్షలాది మంది కార్యకర్తలు పాల్గొని మహానాడును జయప్రదం చేశారన్నారు. కార్యకర్తల్లో ధైర్యాం, స్ఫూర్తిని నింపడంతో పాటు విజన్-2047కి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బాటలు వేశారని, అందుకు వారిద్దరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.





# రైతు పోరుబాటకు విశేష స్పందన

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 30)



నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండో సోలార్ పరిశ్రమకు వ్యతిరేకంగా శుక్రవారం భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'రైతు పోరుబాట' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ పాల్గొని స్థానిక గుడిలో గ్రామ దోషాలు పోవాలని, గంటన్నర పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం కరేడు గ్రామంలోని ప్రజలతో నడుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండు సెంటర్‌లో ఏర్పాటు చేసిన రైతు పోరుబాట సభకు 39 బీసీ కులాసభకు 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ కరేడు గ్రామంలో ఇండో సోలార్ పరిశ్రమకు 8 వేల ఎకరాలు కట్టబెట్టిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల పక్షాన నిలబడి ఎంత వరకైనా పోరాటానికి బిసి వై పార్టీ తరఫున సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇండో సోలార్ కంపెనీ దోపిడి కంపెనీ అని 2019 నుండి ఈ కంపెనీ పై అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇలాంటి కంపెనీని కరేడును గ్రామానికి తీసుకు రావడానికి కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

గతంలో మా ప్రభుత్వం వచ్చిన వెంటనే షిరిడి సాయి ఎలక్ట్రానిక్ కంపెనీపై చర్యలు తీసుకుంటామన్న కూటమి ప్రభుత్వ పెద్దలు జనవరి 12 తర్వాత షిరిడి సాయి కంపెనీ వారు 40 కోట్లు ప్రభుత్వానికి అందిపుచ్చుకోవడంతో మళ్లీ ఇండో సోలార్ పేరుతో వారికే 8 వేల ఎకరాల పచ్చని భూములను అంటగట్టే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. ఎనిమిది వేల ఎకరాల పచ్చని పొలాలను నాశనం చేయడానికి ముందుకొచ్చిన కూటమి ప్రభుత్వం ఆలోచించి ఆ నిర్ణయానికి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల తరఫున బీసీవై పార్టీ ఉద్యమం చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు.





అలానే రాష్ట్రంలో ప్రభుత్వానికి సంబంధించిన వేల ఎకరాలు బీడు భూములు ఉన్నాయని, వాటిని వాడుకొని పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు. ఈ ఘటనపై కేంద్రంలో ఉన్న నాయకుల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరేడు గ్రామ భూ సాగు రైతులు, ఈ కార్యక్రమంలో ఆవుల యానాది, కుంకాల రామసుబ్బారెడ్డి, నాలం సుబ్బారావు, తెడ్డు శ్రీనివాసులురెడ్డి, సవరం వెంకట్రావు ,టెంకాయ చెట్ల పాలింకాపు శేషయ్య, భట్టిపాలెం కాపులు గోవిందు లక్ష్మయ్య, అలగాయపాలెం వెంకటేశ్వర్లు, వాక రాజశేఖర్ రెడ్డి, కలిగి శివారెడ్డి, రామాల కృష్ణారెడ్డి, ఆల్చూరి కృష్ణారెడ్డి, సాదం బుజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 30)

రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో శుక్రవారం పొదిలి ఎస్ఐ వి వేమన మార్కాపురం అడ్డ రోడ్డు వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వేమన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డ్రైవర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

ఆరోగ్య కేంద్రానికి సంబంధించి పలు రికార్డులు పరిశీలన





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 30)

గుడ్లూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను, సిబ్బంది హాజరు పట్టిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో వచ్చే రోగుల సంఖ్య వారికి అందుతున్న అందుతున్న వైద్య సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో మందుల విభాగాన్ని పరిశీలించి రోగులకు ఇస్తున్న మందులు వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని, సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సరైన వైద్య సదుపాయాలు అందించాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు.

# పట్టణంలో విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)



ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటిండెంట్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు ఒంగోలు టౌన్‌లో ఆకస్మిక తనిఖీలు, ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ట్రాన్స్ఫార్మర్లు పని తీరు, ట్రాన్స్ఫార్మర్లు దగ్గర తెసుకోవాల్సిన భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అని తనిఖీలు చేశారు. అనంతరం ట్రాన్స్ఫార్మర్లు దగ్గర బిగించిన మీటర్‌ను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పథకం పి.ఎం. సూర్య ఘర్, ఈ పథకాన్ని జిల్లా ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకుని వెళ్ళాలనే లక్ష్యంతో ఈ పథకం అమలవుతున్న తీరుని, ఈ పథకం ద్వారా పొందే లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం కమ్మపాలెంలోని కొంతమంది పి.ఎం. సూర్య ఘర్ పథకం లబ్దిదారులోతో కూడా మాట్లాడడం జరిగింది. వారు ఈ పథకం వల్ల తమకు విద్యుత్ బిల్లు చాలా ఆదా అయ్యిందన్నారు. అంతేగాక కొంత ఆదాయం కూడా పొందామని ఎస్.ఈకి తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఈ పాండురంగారావు, ఏఈఈ సంతోష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ మాగుంట

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 30)

ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 27,77,268ల విలువగల చెక్కులను 20 మందికి అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పంపిణీ చేశారు.



## నిత్యవసర సరుకులు చౌక దుకాణాల వద్దే పంపిణీ చేయాలి

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్






**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మే 30)**
రేషన్ కార్డుల ద్వారా జూన్ 1వ తేదీ నుంచి నిత్యవసర సరుకులను చౌక దుకాణాల వద్దనే ప్రజలకు పంపిణీ చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో రాజధాని అమరావతి నుంచి శుక్రవారం సంయుక్తంగా వీక్షణ సమావేశం నిర్వహించారు. వీక్షణ సమావేశానికి జిల్లా నుంచి కలెక్టర్ జె.వెంకట మురళి హాజరయ్యారు. చౌక దుకాణాల లైసెన్స్‌లు సంబంధిత దస్త్రాల పరిశీలన ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. దుకాణాల వద్దనే సరుకుల పంపిణీ ఉంటుందనే విషయంపై విస్తృతమైన ప్రచారం చేయాలన్నారు. దుకాణాల్లోని ఈ-పాస్, వేయింగ్ మిషన్లను తూనికలు కొలతలు శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. దివ్యాంగులు, 65 సంవత్సరాలు నిండిన వృద్ధులైన లబ్ధిదారుల ఇంటి వద్దకు డీలర్లు వెళ్లి నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను విధిగా పాటించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 4.70 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. అందులో వృద్ధులు, దివ్యాంగులైన లబ్ధిదారులు 67,800 మంది ఉన్నారన్నారు. ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి సరుకులు పంపిణీ చేయాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు పర్యవేక్షణతో చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి విలియమ్స్, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీకేజ్ అవుతున్నప్పుడు గ్యాస్ ఏజెన్సీకి సమాచారం ఇవ్వాలి

వినియోగదారులకు సూచించిన
పొదిలి కరుణ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ







**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 30)**
పట్టణంలోని విశ్వనాథపురంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ ప్రమాదం చోటు చేసుకోవడం జరిగింది. మొట్ట మొదటగా కరెంట్ షార్ట్ సర్క్యూట్ అయినప్పటికీ పక్కనే ఉన్న సిలిండర్ యొక్క రెగ్యులేటర్ సకాలంలో ఆపకపోవడం వలన, నాణ్యత లేని పైప్ వాడడం వలన, తడి చేయకుండా పొడి బట్టని సిలిండర్ పై వేయడం వలన నిప్పు అంటుకొని ప్రమాదం జరిగింది. గ్యాస్ సిలిండర్ వినియోగదారులందరూ ప్రభుత్వ ఆయిల్ కంపెనీ సురక్ష పైప్ మాత్రమే వాడాల్సి ఉంటుందని సూచించారు. అదేవిధంగా గ్యాస్ వాడకంలో లేనప్పుడు ఖచ్చితంగా రెగ్యులేటర్ ఆపాలన్నారు. గ్యాస్ లీకేజ్ అవుతున్నప్పుడు ఖచ్చితంగా రెగ్యులేటర్ ఆపి సిలిండర్‌ను బయట పెట్టి మీ డెలివరీ బాయ్‌కు గానీ, గ్యాస్ ఏజెన్సీ ఆఫీసులో కానీ సమాచారం ఇవ్వాలన్నారు. ఖచ్చితంగా పాటించాల్సిన ఈ నియమాలు పాటించకుండా వినియోగదారుని నిర్లక్ష్యం వలన ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ కవరేజ్ కూడా వర్తించదన్నారు. గ్యాస్ సిలిండర్ వాడకం విషయంలో పైన పేర్కొన్న భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

# అట్టహాసంగా ప్రారంభమైన మార్కాపురం నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంటు



### టోర్నమెంటును ప్రారంభించిన టీడీపీ నేతలు





**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, మే 30)**
మండలంలోని వెలుగొండ్రాయునిపల్లి గ్రామంలో శుక్రవారం అట్టహాసంగా మార్కాపురం నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంటు ప్రారంభమయ్యింది. ఈ టోర్నమెంటును కొనకనమిట్ల మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), టీడీపీ యువ నాయకుడు ముప్వ కాటంరాజులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల తో శారీరకంగా, మానసికంగా ఎదగవచ్చన్నారు. నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంటు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీలకు క్రికెట్ కిట్లను మార్కాపురం ఎమ్మెల్యే కుమారుడు యువ నాయకుడు కందుల విఘ్నేష్‌రెడ్డి, పోటీల్లో విజేతగా నిలిచే మొదటి స్థానం వారికి రూ.30,116 గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ అందిస్తున్నారు. రెండో బహుమతిగా రూ.20,116 లను గొట్లగట్టు మాజీ వైస్ సర్పంచ్ పొదిలి తిరుపతయ్య, గోరంట్ల నారాయణ (లండన్), మూడో బహుమతిగా రూ.10,116లు కమిటీ, నాలుగో బహుమతి రూ.6,116లను వెలుగొండ్రాయునిపల్లి కి చెందిన తోటకర శ్రీనివాసులు అందజేస్తున్నట్లు నిర్వహకులు పేరయ్య, రోశయ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు పరిటాల సుబ్బయ్య, టీడీపీ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.





# కర్రీస్ పాయింట్‌లో పేలిన గ్యాస్ సిలిండర్ లక్షల్లో ఆస్తి నష్టం

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 30)**
పొదిలి పట్టణంలోని విశ్వనాథపురం గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వీధిలో ఏర్పాటు చేసిన కర్రీస్ పాయింట్‌లో అకస్మాత్తుగా గ్యాస్ సిలిండర్










పేలింది. షాపు వెనుక భాగంగా కూరగాయల తయారీ కేంద్రం ఉంది. ఈ తయారీ కేంద్రంలో కర్రీస్ తయారు చేసేందుకు కూరగాయలు సిద్ధం చేశారు. గ్యాస్ ఆన్ చేసిన సమయంలో గ్యాస్ లీకు అయి స్వల్పంగా మంటలు చలరేగాయి. దీంతో నిర్వాహకులు షాపు లో నుంచి బయటకు పరుగులు తీశారు. గ్యాస్ సిలిండర్‌లో పూర్తిగా గ్యాస్ లేకపోవడంతో భారీ పేలుడు జరగలేదు. దీంతో స్థానికులు ఒక్క సారిగా ఆందోళన చెందారు. అంత భారీ శబ్దం రావడంతో ఒక్క సారిగా ఆ ప్రాంతమంతా ఉలిక్కిపడ్డారు. ఈ పేలుడు సమయంలో సమీపంలో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం జరగలేదు. పేలుడు దాటికి దుకాణం ముందు ఉన్న గ్లాస్ కౌంటర్ రోడ్డు పై పడి పగిలిపోయింది. పక్క దుకాణంలో సీలింగ్ కూలిపోయింది. ఈ సంఘటనతో పొదిలి పట్టణ ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. సిలిండర్‌లో కొద్దిపాటి గ్యాస్ ఉండటంతో స్వల్పంగా పేలుడు సంభవించిందని, అదే సిలిండర్ నిండుది అయి ఉంటే ఏం జరిగేదో ఊహించుకుంటేనే భయంగా ఉందని పలువురు స్థానికులు తెలిపారు. ఆస్తి నష్టం లక్షల్లో ఉంటుందని తెలుస్తోంది. మొత్తం మీద ఎటువంటి ప్రాణం నష్టం లేకుండా బయటపడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చివరగా అక్కడకు చేరుకున్న ఫైర్ ఇంజన్ కొద్దిపాటి మంటలను అదుపు చేసింది.

# వెంటనే అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..?

జూన్ 2న మండల కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయండి



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, మే 30)**
అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జూన్ రెండో తేదీన మండల కార్యాల వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో రాష్ట్రంలో 32 లక్షల ఇళ్ల స్థలాల నిర్మాణం చేపట్టిందని వాటిల్లో 50 శాతం కూడా పూర్తి కాలేదని, ఆగిపోయిన నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలలో ఇచ్చిన హామీలో భాగంగా పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాల ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇచ్చి నిర్మాణం చేపట్టాలని, సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో తేదీ జరిగే ధర్నాకు సిపిఐ పార్టీ సానుభూతిపరులు, సభ్యులు, అర్హులైన పేదలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ కృష్ణ గౌడ్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు బాణాల రామయ్య, యర్రగొండపాలెం మండల సహాయ కార్యదర్శులు వై.వెంకట శివయ్య, నక్కా తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com